క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 1200 కేజీల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ధర్మవరం నుంచి కర్ణాటకకు ఆటోలో ఓ వ్యక్తి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఆటోతో పాటు బియ్యాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కానిస్టేబుల్ జగన్ నాయక్, రంగ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లి నుంచి జగన్నాథ్ మడకశిరకు వస్తుండగా మల్లినాయకనహళ్లి గ్రామ సమీపంలో ఫిట్స్ రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో జగన్నాథ్ తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న ప్రజలు గమనించి జగన్నాథ్‌ను మడకశిర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైనా చికిత్స కోసం హిందుపురానికి తరలించారు.

చలివేంద్రం ఏర్పాటు

మడకశిర: పట్టణంలోని ఫోర్‌వీల్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వాస్పత్రి సమీపంలోని డ్రైవర్ల కార్యాలయం వద్ద ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డ్రైవర్లు తెలిపారు. పట్టణంలోని డ్రైవర్లందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఎంపీ కారు

మడకశిర: మండలంలోని బుళ్లసముద్రం సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనాన్ని కర్ణాటకకు చెందిన ఓ ఎంపీ కారు ఢీ కొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు... పావగడలో బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బెంగళూరు సెంట్రల్ బీజేపీ ఎంపీ పీసీ మోహన్ బెంగళూరు నుంచి మడకశిర మీదుగా పావగడకు కారులో వెళ్తున్నారు. అయితే మడకశిర మండలంలోని బుళ్లసముద్రం సమీపంలో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న బి.రాయాపురం గ్రామానికి చెందిన నరసింహమూర్తి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ నరసింహమూర్తిని ఎంపీ తన కారులోనే మడకశిర ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఇదిలా ఉండగా కేంద్రమంత్రి నారాయణస్వామి విషయం తెలుసుకొని మడకశిర ఆస్పత్రితో బాధితుడిని పరామర్శించారు.


అపరిశుభ్రంగా వ్యవసాయ కార్యాలయం



వ్యవసాయాధికారి కార్యాలయం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

హిందూపురం టౌన్: పట్టణంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. కార్యాలయం ఆవరణంలో పిచ్చిమొక్కలు పెరగడంతో విషపురుగులకు ఆవాసంగా మారింది. కార్యాలయం సమీపంలో ఉన్న రైతు బజార్‌లో ప్రస్తుతం హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. అక్కడ పోగయ్యే చెత్తా చెదారాన్ని వ్యవసాయ కార్యాలయం ముందు, ఆవరణలో పడేస్తుండడంతో కార్యాలయం చెత్తాచెదారానికి నెలవుగా మారింది. వ్యవసాయాధికారులు స్పందించి కార్యాలయ ఆవరణంలో పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించండి



సచివాలయ ఉద్యోగులతో సమావేశమైన డీఎల్‌డీఓ శివారెడ్డి

గోరంట్ల: మండల పరిధిలోని మల్లాపల్లి సచివాలయాన్ని బుధవారం పెనుకొండ ఇన్‌చార్జి డీఎల్‌డీఓ శివారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. నిధుల వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫీవర్ సర్వే, ఆయుష్మాన్ భారత్, ఎస్‌డీజీ గోల్స్ సర్వే గురించి చర్చించారు. 2016 కంటే ముందు ఆధార్ పొందిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకొనే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్తా, పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్, సర్పంచ్ శివనంద తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి భరోసా

- అధిక శాతం మందికి వైరల్ జ్వరాలు
- అదునుచూసి దోపిడీ చేస్తున్న ప్రైవేటు క్లీనిక్‌ల నిర్వాహకులు
- ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలపై సర్వత్రా హర్షం



చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు



హిందూపురం ఆస్పత్రిలో ఓపీ చీటీ కోసం క్యూలో ఉన్న జనం

హిందూపురం: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులతో పాటు వైద్య సిబ్బంది ఉత్తమ వైద్య సేవలు అందిస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ వారంలోనే చిన్నపిల్లల వార్డులో రోగుల సంఖ్య రెండింతలుగా పెరిగింది. పట్టణ శివారు ప్రాంతాలతో పాటు పరిసరా గ్రామాల ప్రజలు టైఫాయిడ్, వైరల్ ఫీవర్లతో అధిక సంఖ్యలో ఆస్పత్రికి తరలివస్తున్నారు. వైరల్ ఫీవర్స్, డెంగీ లక్షణాలతో ప్రతిరోజూ ఎక్కువ మంది చిన్నారులు చికిత్స చేయించుకుంటున్నారు. వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఎంహెచ్‌సీ కేంద్రాల్లో కూడా పెద్ద సంఖ్యలో రోగులు చికిత్స పొందుతున్నారు. వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తుండంతో రోగులు త్వరగా కోలుకుంటున్నారు.

ప్రైవేటు దోపిడీ..

సీజనల్ వ్యాధులు పెరగడంతో ప్రైవేట్ క్లినిక్‌లు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. రూ.100 నుంచి రూ.150 వరకు పెట్టి టోకన్లు చేతపట్టుకుని క్లినిక్ వద్ద పిల్లలతో గంటల తరబడి వేచి ఉంటున్నారు. చిన్నపాటి జర్వానికైనా కొందరు ప్రైవేటు వైద్యులు రక్త, మూత్ర పరీక్షలతో పాటు అధికంగా మందులు, టానిక్కులు ఇచ్చి దోచేస్తున్నారు. జ్వర మొస్తే చాలు రూ.వెయ్యి ఖర్చు కావాల్సిందే అన్న రీతిలో పరిస్థితి మారిపోయిందని పలువురు వాపోతున్నారు.

పెద్దాస్పత్రికే ఎక్కువ మంది

ప్రైవేటు వైద్యం సరిగా అందకపోతుండటంతో ఎక్కువ మంది పెద్దాస్పత్రికే వస్తున్నారు. ఇక్కడి వైద్యులు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందిస్తుండటంతో రోగులు త్వరగా కోలుకుంటున్నారు.

ప్రైవేటులో చూపించినా తగ్గలేదు



జ్వరం రావడంతో మా బాబును హిందూపురం ఆస్పత్రిలో రెండు రోజుల కిందట చేర్పాము. అంతకు ముందు ప్రైవేటు ఆస్పత్రిలో చూపించినా ఏ మాత్రం తగ్గలేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ప్రసుత్తం జ్వరం తగ్గముఖం పట్టింది.
– శిరిషా, కగ్గల్లు

మంచి మందులిస్తున్నారు



ఇద్దరు పిల్లలకు జ్వరం వచ్చింది. అమ్మాయికి కొద్దిగా తగ్గింది. బాబుకు ఐదురోజులగా పెద్దాస్పత్రిలోనే చికిత్స చేయిస్తున్నాం. అంతకు ముందు ప్రైవేటుగా రూ.వెయ్యి ఖర్చు పెట్టి చూపించినా నయం కాలేదు. ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ పరీక్షలు చేస్తూ మంచిగా మందులు ఇస్తున్నారు.
– షామీమ్, రహమత్‌పురం, హిందూపురం

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా సీజినల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే అవసరమైన మందులు సమకూర్చాము. ఇంకా అవసరమైతే హెచ్‌డీఎఫ్ నిధుల నుంచి మందులు కొనుగోలు చేస్తాం. పరీక్షల కోసం ల్యాబ్‌లో కూడా అన్ని సదుపాయలు కల్పించాం. వైద్యులు వార్డుల్లో రౌండ్స్ వేసి పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నాం.
–రోహిల్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, హిందూపురం

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం అసెంబ్లీలో మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి కలిశారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. సమస్యల పరిష్కరించి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే మడకశిర బైపాస్ కెనాల్ మంజూరు చేసినందుకు మరోసారి సీఎంకు కృతజ్ఞతలు తెలిపినట్లు వివరించారు.

నిందితుల కోసం గాలింపు

పావగడ: వైఎన్ హొసకోట పోలీసు స్టేషన్ పరిధిలోని ఇంద్రబెట్ట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే నిందితుల ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నామని రూరల్ సీఐ కాంతరెడ్డి తెలిపారు. హతుడి కుడి చేతిపై చిట్టమ్మ, కావేరి అనే పేర్లు ఉన్నాయన్నారు. అలాగే షర్ట్ కాలర్ మీద మెట్రో టైలర్స్, కళ్యాణదుర్గం అనే లేబుల్ ఉందన్నారు. హతుడి వివరాలు తెలిసిన వారు పావగడ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

రొళ్ల: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి గురువారం నుంచి 16వ విడత సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ రామారావు, ఏపీఓ నాగరాజు తెలిపారు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు ఉపాధి పథకం ద్వారా 801 పనులకు గాను రూ.6.97 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి నివేదికలను వారం రోజుల పాటు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామ స్థాయిలో పర్యటించి చేపట్టిన పనులు, నిధుల వినియోగం ఇతరాత్ర అంశాలను సేకరిస్తారన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించే బహిరంగ సభలో చదివి వినిపించడం జరుగుతుందన్నారు.

వ్యక్తి మృతి



మృతుడు నాగభూషణ

పరిగి: మండలంలోని హొన్నంపల్లి - ధనాపురం రోడ్డులో రెండు రోజుల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో హొన్నంపల్లికి చెందిన సంజీవరెడ్డి అనే వ్యక్తి చనిపోయిన విషయం తెలిసిందే. అయితే ప్రమాదంలో గాయపడిన నాగబూషణ (45) అలియాస్ నాగ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషయం పాఠకులకు విదితమే. తీవ్ర గాయాలతో హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా... పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో నాగభూషణ మృతి బుధవారం చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సజావుగా వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో బుధవారం సాయంత్రం వాహనాల వేలం పాట జరిగింది. సెబ్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ.2,14,700 ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందని సెబ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్ మహిళా పక్షపాతి



రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళినిని సన్మానిస్తున్న మహిళలు

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏపీఎం.తిప్పన్న, మండల అధ్యక్షురాలు లలితమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం నుంచి పట్టణంలోని ర్యాలీ నిర్వహించారు. నళిని మాట్లాడుతూ సీఎం జగనన్న మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించారన్నారు. ముఖ్యంగా నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించి నియమించారని గుర్తు చేశారు.

పెనుకొండ: విద్యతోనే మహిళలు అభ్యున్నతి సాధిస్తారని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ మహిళలు విద్యతో పాటు సామాజిక, ఆర్థిక విషయాల్లో పురోగతి సాధించాలన్నారు. డీఎల్‌డీఓ శివారెడ్డి మాట్లాడుతూ మహిళలు చైతన్య వంతులు అయితేనే ఆ కుటుంబం అభివృద్ధి సాధిస్తుందన్నారు. మాబున్నీ, ప్రమీల తదితరులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందించారు.

రొద్దం: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో రొద్దకాంబ మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ పద్మావతి , సర్పంచ్ రూప, ఏపీఎం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన

అమరాపురం: మండల పరిధిలోని పుల్లీకుంటలో ఆర్డీటీ ఆధ్వర్యంలో శుద్ధమైన తాగునీటిని ప్రజలకు అందించడానికి బుధవారం ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు.తాగునీటి సమస్య పరిష్కారానికి సంస్థ తరుపున రూ.7 లక్షల వ్యయంతో వాటర్ ఫిల్టర్ ప్లాంటు మంజూరైందన్నారు. కార్యక్రమంలో సీట.చంద్ర, సీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

అమరాపురం: మండలంలోని వంట ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈఓ సత్యనారాయణ సూచించారు. బుధవారం మండలంలోని వి.అగ్రహారం, వలస ఎస్సీ కాలనీ, వలస ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

జేడీఎస్‌లోకి భారీగా చేరికలు

పావగడ: స్థానిక హమాలి సంఘం నాయకులు జేడీఎస్ పార్టీకి జై కొట్టారు. స్థానిక మెహర్ బాబా ఆలయంలో బుధవారం హమాలి సంఘం నాయకులు సుమారు 160 మంది కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి జేడీఎస్‌లోకి మూకుమ్మడిగా చేరారు. జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప, జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు బలరామరెడ్డి, హమాలి సంఘం అధ్యక్షుడు నారాయణప్ప, హమాలి సంఘం కార్యదర్శి ఈరణ్ణ , గడ్డం తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా - ఒకరి మృతి





మృతుడు రంగనాయకులు

గోరంట్ల: మండల పరిధిలోని కమ్మలవాండ్లపల్లి సమీపంలో గూళురు–కోరేవాండ్లపల్లి ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒకరు చనిపోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ బాబు వివరాల మేరకు .. శీనప్పల్లి గ్రామానికి చెందిన డేరంగుల రంగనాయకులు (30) తన సొంత ట్రాక్టర్ ద్వారా కర్ణాటక రాష్ట్రంలోని వర్దంపల్లి క్వారీ నుంచి రాళ్లు శీనప్పల్లికి తీసుకొస్తున్నారు. అయితే కమ్మలవాండ్లలపల్లి - బగవంతపల్లి మధ్యలో మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ నడుపుతున్న రంగనాయకులు అక్కడిక్కడే మృతి చెందారు. ట్రాక్టర్ పనికి కూలీగా వెళ్లిన శీనప్పల్లికి చెందిన సునీల్ తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవయవ దానం.. మరొకరికి ప్రాణదానం



అవయవదానం గురించి వివరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

హిందూపురం: అవయవ దానంతో మరొకరికి ప్రాణదానం చేసినట్లే.. అవయవ దానంతో మరణించినా జీవించే అదృష్టాన్ని పొందడానికి అందరూ ముందుకు రావాలని అవయవదానం ప్రచారకర్తలు ధనాపురం వెంకటరామిరెడ్డి, చైతన్య గంగిరెడ్డి, లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుతో మాట్లాడారు. అవయవదానంపై సరైన అవగాహనలేక అపోహల కారణంగా ప్రజల్లో చైతన్యం రాలేదన్నారు.చాలా కొద్ది మంది మాత్రమే చనిపోయాక అవయవాలను మరొకరికి దానం చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. అవయవ దానంపై హిందూపురంలో తాము ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అవయవ దానానికి ముందుకొచ్చేవారు వెంకట్రామిరెడ్డి సెల్: 9949782550, చైతన్య గంగిరెడ్డి సెల్: 9849545285), లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్ సెల్: 9908052099 లను సంప్రదించాలన్నారు.

బీజేపీ అక్షయ పాత్ర లాంటిది

- కేంద్ర మంత్రి నారాయణస్వామి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

పావగడ: కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారంలోకి వస్తే ఒక వ్యక్తికి 10 కేజీల బియ్యం అందిస్తామని అబద్ధాలు చెబుతున్నారని అయితే బీజేపీ అక్షయ పాత్ర లాంటిదని అన్ని వర్గాల వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని కేంద్ర మంత్రి ఏ నారాయణస్వామి తెలిపారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో బుధవారం నిర్వహించిన మధుగిరి జిల్లా బీజేపీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మోర్చా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో మోదీ నాయకత్వంలో అన్ని సామాజిక వర్గాల వారికి అన్ని రంగాల్లోనూ న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ నాయకులు గ్యారంటీ కార్డులు ఇస్తుండడం సిగ్గు చేటని, అసలు కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందన్న గ్యారంటీ లేదని ఎద్దేవా చేశారు. బెంగుళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ , బీజేపీ నాయకులు వెంకట్రామయ్య, రవి, మాధవరెడ్డి, లాయర్ కృష్ణానాయక్, హనుమంతరాయప్ప, బ్యాడనూరు శివు, రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ ఆస్పత్రి ప్రారంభం

పావగడ: కేంద్ర ప్రభుత్వ నిధులతో అధునాతనంగా నిర్మించిన స్థానిక తల్లి బిడ్డ ఆస్పత్రిని సద్వినియోగం చేసుకోవాలని చిత్రదుర్గం ఎంపీ, కేంద్ర మంత్రి ఏ నారాయణస్వామి మహిళలకు సూచించారు. స్థానిక తాలూకా ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.22 కోట్ల తో నిర్మించిన నూతన తల్లీ బిడ్డ ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప, ప్రభుత్వాస్పత్రి పాలనాధికారి డా కిరణ్, టీహెచ్ఓ తిరుపతయ్య, డీహెచ్ఓ మంజునాథ్, మాజీ జెడ్పి సభ్యుడు హెచ్‌వి వెంకటేశ్, శంకరరెడ్డి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం ఏర్పాటుకు రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

గోరంట్ల: గోరంట్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న వైకుంఠ రథం కోసం బుధవారం ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ఆ మొత్తాన్ని పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్‌కు అందజేశారు. మధుసూధనరావు, లలీతమ్మ, రవీంద్ర, రామ్మోహన్‌రెడ్డి, అంజినరెడ్డి, లక్ష్మీపతి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



రొద్దం: విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం



హిందూపురం: నంబర్‌ను చెక్ చేస్తున్న విద్యార్థినులు

హిందూపురం టౌన్: పట్టణంలో బుధవారం నుంచి ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. హిందూపురంలోని 9 పరీక్షా కేంద్రాలలో పరీక్షలను నిర్వహించారు. పరీక్ష మొదటి రోజు కావడంతో పరీక్షా సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రం వద్దకు చేరుకున్నారు. పరీక్షా హాలులో కూర్చొన్న విద్యార్థులకు ఇన్విజిలేటర్లు పలు సూచనలు చేశారు.

లేపాక్షి: లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఎంజేపీఏపీ గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయాల విద్యార్థులు 192 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. ఏడుగురు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు.

పెనుకొండ: పట్టణంలో ఇంటర్ పరీక్షలు బుధవారం సజావుగా జరిగాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్యసాయి డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. పరీక్షలు పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగాయి. విద్యార్థులకు తాగునీటి వసతి, వైద్య సేవలు అందించారు. సెల్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి అనుమతించలేదు.

మడకశిరరూరల్: ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 385 మంది విద్యార్థులకుగాను 12 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అదే విధంగా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 344 మందిగాను 335 మంది విద్యార్థులు హజరయ్యారని, 9 మంది విద్యార్థులు హజరు కాలేదు. వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో 275 మంది విద్యార్థులకుగాను 267 మంది విద్యార్థులు హజరుకాగా, 8 మంది విద్యార్థులు హజరు కాలేదు. మూడు పరీక్షా కేంద్రాల్లో 29 మంది విద్యార్థులు హజరు కాలేదని అధికారులు తెలియజేశారు.

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 80 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి చెప్పారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించి ఎలాంటి ఘటనలు జరకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం తెలుగు పేపర్ 1 పరీక్షలకు మొత్తం 247 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5 మంది విద్యార్థులు గైర్హజరయ్యారు. 242 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మహేష్ తెలిపారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట దగ్గర ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా మాట్లాడుతూ తొలిరోజు తెలుగు, హిందీ, ఒకేషనల్ జీఎఫ్‌సీ సబ్జెక్ట్‌లకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 277 మంది విద్యార్థులకుగాను 267 మంది హాజరయ్యారని, 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు

ఘనంగా ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

హిందూపురం టౌన్: జీవన జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని బుధవారం స్థానిక బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరంతో పాటు హక్కులు, చట్టాలు, పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది శివకుమార్, సత్యసాయి జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షురాలు నాగజ్యోతి, అధ్యాపకులు మాధురి, దయానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.